క్లుప్తంగా

రెగ్యులర్ చేయాలి

ఆదోనిరూరల్: మున్సిపల్ ఇంజినీరింగ్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎన్ఎంఆర్‌లను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి.ఈరన్న, పట్టణాధ్యక్షుడు తిప్పన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఇంజినీర్ కార్యాలయ ఆవరణలో మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికుల సర్వీసును పరిగణలోకి తీసుకొని పర్మినెంట్ చేయాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు యూనిఫాంలు ఇవ్వాలని, కార్మికులకు 101 పద్ధతి కింద వేతనాలు ఇవ్వాలన్నారు. మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సౌకర్యాలు కల్పించండి

ఆదోని సెంట్రల్: సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి బాలు కోరారు. ఈ మేరకు బుధవారం సబ్‌కలెక్టర్ నారాయణ శర్మను కలిసి వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ.. వసతి గృహాల్లో టాయిలెట్స్, తాగునీరు, లైట్స్, ఫ్యాన్లు వంటి సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొంతమంది వార్డెన్లు సరిగా పౌష్టికాహారం అందించడం లేదని ఆరోపించారు. అలాగే వసతి గృహాలకు సన్నబియ్యం సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఆర్‌పీఎస్ఎఫ్ నాయకులు విష్ణు, హరి, తిమ్మప్ప, రాజు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం ధ్వంసం



మద్యాన్ని ధ్వంసం చేయిస్తున్న సెబ్ సీఐ హరికృష్ణ, సిబ్బంది

ఆదోనిరూరల్: వివిధ కేసుల్లో ఆదోని సెబ్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన అక్రమ మద్యాన్ని బుధవారం రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేసినట్లు సెబ్ సీఐ హరికృష్ణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లా అడిషనల్ ఎస్పీ క్రిష్ణకాంత్‌పటేల్ ఆదేశాల మేరకు జిల్లా ఏఈఎస్ రాజశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న మద్యాన్ని ధ్వంసం చేసినట్లు చెప్పారు. మొత్తం 20 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 158 లీటర్ల సారా, 91 కేసుల్లో పట్టుబడిన 24,404 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు నేలపాలు చేసినట్లు చెప్పారు. ఎప్పటికప్పుడు అక్రమ మద్యం సరఫరాపై ఉక్కుపాదం మోపుతున్నామని పేర్కొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం

ఆలూరు రూరల్: స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాల-2 పూర్వ విద్యార్థులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు విరాళం అందించినట్లు హెచ్ఎం సత్యనారాయణ బుధవారం తెలిపారు. 1972–73 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఈ నెల 10వ తేదీన జరిగిన అపూర్వ సమ్మేళనంలో పాల్గొని పాఠశాలకు సీసీ కెమెరాలు వితరణ చేస్తామని మాట ఇచ్చారన్నారు. ఇందులో భాగంగానే నాలుగు సీసీ కెమెరాలకు అయ్యే నగదును అందించినట్లు చెప్పారు. పూర్వ విద్యార్థులకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.

వైభవంగా దేవర

కౌతాళం: మండల పరిధిలోని బంటకుంట గ్రామంలో దేవర మహోత్సవం వైభవంగా జరిగింది. బుధవారం తెల్లవారు జామున 2 గంటలకు మేటి కుంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో ఆకు పూజ, కుంకుమార్చన, ప్రత్యేక పూజలతో ఉత్సవం ప్రారంభించారు. భక్తులు కుంభాలతో తరలివచ్చి మారెమ్మవ్వ, సుంకులమ్మ ఆలయాల్లో పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున 4 గంటల నుంచి ప్రారంభమైన కుంభోత్సవం సాయంత్రం వరకు కొనసాగింది. భక్తులు వేలాదిగా తరలిరావడంతో గ్రామంలోని వీధులు జనంతో కిటకిటలాడాయి. గ్రామ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ప్రహ్లాదచారి, మండల సచివాలయాల కన్వీనర్ వెంకటరామిరెడ్డి, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్ తదితరులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు.

క్రికెట్ టోర్నీ విజేత ఎస్ఎస్‌జీ జట్టు



విజేత జట్టుకు కప్ అందజేస్తున్న కొరివి నాగరాజు

కోసిగి: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని గ్రౌండ్‌లో వైఎస్సార్‌సీపీ యువనేత వై.ధరణీధర్ రెడ్డి సహకారంతో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో కోసిగికి చెందిన ఎస్ఎస్‌జీ జట్టు విజేతగా గెలుపొందింది. బుధవారం గ్రౌండ్‌లో ఎస్ఎస్‌జీ జట్టు, బ్లాక్ స్క్వాడ్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్‌లు హోరాహోరీగా జరిగాయి. ఇందులో ఎస్ఎస్‌జీ జట్టు విజేతగా, బ్లాక్ స్క్వాడ్ జట్టు రన్నర్‌గా నిలిచాయి. ఆయా జట్లకు కప్‌లను కోసిగికు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కొరివి నాగరాజు చేతుల మీదుగా అందజేశారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

- రూ.10 కోట్లతో వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణం పూర్తి
- అందుబాటులో నాణ్యమైన వైద్య సేవలు
- రూ.7 కోట్లతో 50 పడకల స్త్రీ, చిన్నపిల్లల ఆస్పత్రి నిర్మాణం పూర్తి
- మరో రూ.7 కోట్లతో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి



రూ.7 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ ఆస్పత్రి





ఆదోనిలో నూతనంగా నిర్మించిన వంద పడకల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి



మరమ్మతులు చేపట్టిన స్త్రీ, చిన్నపిల్లల ఆస్పత్రి

ఆదోనిఅర్బన్: చిన్న, పెద్ద ఆరోగ్య సమస్యలు వచ్చినా గతంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన చికిత్సలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. పెద్దగా ఆరోగ్య సమస్య వచ్చిందంటే కర్నూలులోని ప్రభుత్వ ఆస్పత్రికి, ప్రయివేట్ ఆస్పత్రులకు వెళ్లి వేలాది రూపాయలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉండేది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని నాడు-నేడు కింద వేలాది కోట్ల రూపాయలను వైద్య రంగానికి కృషి చేశారు.

➡ గతంలో అరకొర సౌకర్యాలు

ఆదోనిలో 2001 సంవత్సరంలో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, స్త్రీ చిన్నపిల్లల ఆస్పత్రులు ప్రారంభమయ్యాయి. వంద పడకలతో ప్రభుత్వ ఆస్పత్రి, 50 పడకలతో చిన్నపిల్లల ఆస్పత్రిని ప్రారంభించారు. అప్పటి నుంచి ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా తర్వాత జనాభా ఎంతగా పెరిగినా అందులోనే అరకొర వసతులతో చికిత్స చేయించుకుంటూ ప్రజలు ఇబ్బందులు పడేవారు.

➡ రూ.27 లక్షలతో అభివృద్ధి

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే నాడు-నేడు పథకం కింద రూ.10 కోట్లతో నూతనంగా వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణం పూర్తి చేసి అందులో వైద్య సేవలందిస్తున్నారు. అంతేగాకుండా ప్రస్తుతం ఉన్న వంద పడకల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో అదనంగా మరో వంద పడకల కోసం రూ.7 కోట్లతో నిర్మాణం చేపడుతున్నారు. అలాగే రూ.7 కోట్లతో నూతనంగా 50 పడకల ప్రభుత్వ స్త్రీ, చిన్నపిల్లల ఆస్పత్రి నిర్మాణం పూర్తి చేసి అందులో సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఆస్పత్రిని కూడా మరమ్మతులు చేపట్టి అత్యాధునిక పరికరాలు, గదులతో నిర్మాణం పూర్తి చేసి సేవలందిస్తున్నారు. నూతన భవనంలో వంద పడకలు, డాక్టర్ రూమ్‌లు, ఎక్స్‌రే, ల్యాబ్‌లు, స్టాఫ్ రూమ్‌లు అభివృద్ధి చేపట్టారు. గతంలో లేని అభివృద్ధి పనులు జరగడంతో రోగులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఇలాంటి అభివృద్ధి చూడలేదు



గతంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చిపోయాయి. ఇలాంటి అభివృద్ధి ఎప్పుడూ చూడలేదు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్థానిక ఆస్పత్రిలో ఎన్నో సౌకర్యాలు కల్పించింది. నాకు టైఫాయిడ్ జ్వరం రావడంతో మూడు రోజులుగా ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నా. అన్ని రక్త పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. సరైన సమయానికి డాక్టర్లు వచ్చి బాగా చూస్తున్నారు. ఇలాంటి నాణ్యమైన చికిత్స ఉంటుందని ఊహించలేదు. ప్రయివేట్ ఆస్పత్రులకు వెళితే వేలాది రూపాయలు ఖర్చయ్యేది. ఇక్కడ ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా చికిత్సలు అందిస్తుండడంతో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది.

– రామాంజనేయులు, ఆలూరు

ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది



కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఆస్పత్రిని అభివృద్ధి చేయడం వల్ల డివిజన్ పరిధిలోని ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. డబ్బు ఖర్చు పెట్టుకుని ప్రయివేట్ ఆస్పత్రికి వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఎన్నో గ్రామాల ప్రజలు ఆదోని ప్రభుత్వ ఆస్పత్రినే నమ్ముకున్నారు. అందుకు తగ్గట్టుగానే అభివృద్ధి జరుగుతోంది. నా కుమార్తె సిరికి వాంతులు, విరేచనాలు కావడంతో ఆస్పత్రికి తీసుకొచ్చిన వెంటనే డాక్టర్లు, నర్సులు ముందుకొచ్చి చికిత్స చేశారు. స్పెషల్ వార్డులో ఉంచారు. ఇంతటి అభివృద్ధి, సౌకర్యాలు ఉన్నాయని అనుకోలేదు.

– జైపాల్, కడితోడ గ్రామం

అత్యాధునిక వసతులతో అభివృద్ధి



రూ.27 కోట్లతో ఆదోని పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేశాం. ఆదోని ఏరియా ఆస్పత్రి, మాతాశిశు ఆస్పత్రి రోగులకు వినియోగంలోకి వచ్చాయి. అత్యాధునిక పరికరాలతో పాటు అత్యవసర వైద్యం, కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్యం అందుతోంది. గుండె జబ్బులకు కూడా ప్రభుత్వ ఆస్పత్రిలో ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయి. సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలనలో వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు.

– సాయిప్రసాద్‌రెడ్డి, ఆదోని ఎమ్మెల్యే

సంక్షేమ ప్రభుత్వాన్ని నిలబెట్టుకుందాం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న వై.ప్రదీప్‌రెడ్డి

పెద్దకడబూరు: రాబోయే ఎన్నికల్లో మరోసారి సంక్షేమ రథ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బ్రహ్మరథం పడదామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కంబలదిన్నె గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన గడప గడపకు వెళ్లి అక్కా చెల్లెమ్మలతో మాట్లాడి సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పథకాల కోసం ఎవ్వరికీ ఒక్క పైసా ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఈ పథకాలు ఇలాగే కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. టీడీపీ నాయకుల మోసపు మాటలు నమ్మితే మరోసారి ఇబ్బందులు ఎదుర్కొవాల్సి ఉంటుందని వివరించారు. ఎన్నికల నేపథ్యంలో వై.ప్రదీప్‌రెడ్డి అభిమానులు ఆయన గురించి రాసిన పాటను రిలీజ్ చేశారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, విజయేంద్ర రెడ్డి, రఘురాముడు, నరసప్ప, భీమన్న, మారెన్న, ఆంజనేయ, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా పేదలకు వరం

మంత్రాలయం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ బీమా నిరుపేదలకు వరమని పార్టీ మండల కన్వీనర్ భీమారెడ్డి అన్నారు. మండల పరిధిలోని చెట్నిహళ్లి గ్రామంలో వడ్ల వీరాంజనేయులు అనారోగ్యంతో మృతి చెందడంతో నామినీగా ఉన్న ఆయన భార్యకు బుధవారం తక్షణ సాయం కింద రూ.10 వేలు, ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. మిగతా సొమ్ము త్వరలో నామినీ బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు. గ్రామ సర్పంచ్ అంజిని, ఉప సర్పంచ్ వీరనాగప్ప, ఎంపీటీసీ రామాంజనేయులు ఉన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు



మంత్రాలయంలో సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం: వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు వెల్లివిరిశాయని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మంత్రాలయం సచివాలయం-2 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి మంజూరైన సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమమే ప్రధాన అజెండాగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఉద్ఘాటించారు. నవరత్నాల పథకాలు ప్రవేశపెట్టి ప్రతి వర్గం ప్రజలకు సంక్షేమ ఫలాలు అందేలా చేశారన్నారు. అమ్మ ఒడి, మన బడి నాడు – నేడు, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, జగనన్న తోడు, జగనన్న విద్యా దీవెన తదితర పథకాలతో పేదల జీవన ప్రమాణాలు పెంచారని విషదీకరించారు. ప్రతి కాలనీలో ఇంటింటికీ కొళాయిలను త్వరలోనే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కాచాపురం సర్పంచ్ వై.జయమ్మ, మహిళ నాయకురాలు వై.ప్రియాంక, మండల కన్వీనర్ భీమారెడ్డి, ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, ఎంపీడీఓ మణిమంజరి, సీఐ శ్రీనివాసులు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, ఉప సర్పంచ్ పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

➡ సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

మంత్రాలయం: మండల కేంద్రంలోని సచివాలయం-2 పరిధిలో రూ.60 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైయినేజీ నిర్మాణానికి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి భూమి పూజ చేశారు. బుధవారం రాఘవేంద్రనగర్‌లో కాచాపురం సర్పంచ్ వై.జయమ్మ, మహిళా నాయకురాలు వై.ప్రియాంకలతో కలిసి ఎమ్మెల్యే అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వేధింపుల కేసు నమోదు

కృష్ణగిరి: కల్లూరు మండలం కేంద్రం, పార్వతినగర్‌కు చెందిన ఉప్పరి శ్రీలతను కృష్ణగిరి మండలం మాదాపురానికి చెందిన భర్త, అతని కుటుంబ సభ్యులు వేధిస్తున్నట్లు బుధవారం కృష్ణగిరి పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. ఎస్ఐ సురేశ్ తెలిపిన వివరాల మేరకు బాధితురాలికి, ఉప్పరి మధుతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. ఇటీవల పిల్లలు పుట్టలేదని, అదనపు కట్నం తీసుకురమ్మని భర్త, ఆ కుటుంబ సభ్యులు వేధిస్తున్నట్లు ఫిర్యాదు చేసింది. శ్రీలత ఫిర్యాదు మేరకు ఆమె భర్తతో పాటు మరో ఐదుగురు కుటుంబ సభ్యులపై వేధింపుల కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు గాదిలింగప్పతాత రథోత్సవం



పూజలందుకుంటున్న గాదిలింగేశ్వర స్వామి

హొళగుంద: మండలంలోని ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం గూళ్యం గాదిలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం గాదిలింగప్ప తాత 20వ పూల రథోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు, గ్రామపెద్దలు తెలిపారు. పూల రథోత్సవం వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. అలాగే తాత వారి రథాన్ని సుందరంగా అలంకరించారు. రథోత్సవంలో పాల్గొనే భక్తులకు అన్నదానం, మంచినీటి సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు.

జనం మెచ్చిన నాయకుడు జగనన్న



వృద్ధురాలికి సంక్షేమ క్యాలెండర్ అందిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిరూరల్: జనం మెచ్చిన నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకు స్థానిక ప్రజలు భారీ గజమాలతో స్వాగతం పలికారు. డప్పు వాయిద్యాల నడుమ గ్రామంలో ఊరేగించారు. ఎమ్మెల్యే ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మొత్తం 450 గృహాలను సందర్శించి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అవినీతికి తావు లేకుండా గ్రామంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.27,33,46,000 లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు వివరించారు. జగనన్న కాలనీలో 303 మందికి ఇళ్ల పట్టాలు, బీసీ, మైనార్టీ కాలనీల్లో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.70 లక్షలతో సీసీ రోడ్డు, ఎస్సీ కాలనీలో రూ.35 లక్షలు పంచాయతీ నిధులతో సీసీ రోడ్లు, రూ.15 లక్షలతో తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సచివాలయ నిధుల ద్వారా రూ.20 లక్షలతో ఎస్సీ కాలనీలో డ్రైనేజీ, సీసీ రోడ్లు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, సర్పంచ్ ఉచ్చప్ప, బసవరాజ్, లక్ష్మిశివరాజ్, మౌలా, ఉప సర్పంచ్ తిక్కయ్య, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి రమేష్, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, వీరశైవ లింగాయత్ డైరెక్టర్ దేవిశెట్టి మంజుల, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రేణుక, నాయకులు శ్రీలక్ష్మి, గురునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆదోని మున్సిపాలిటీ బడ్జెట్ రూ.61.44 కోట్లు

- మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ శాంత

ఆదోనిటౌన్: 2024 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2025 మార్చి 31వ తేదీ వరకు ఆదోని మున్సిపల్ అంచనా బడ్జెట్ రూ.61.44 కోట్లుగా మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. కౌన్సిల్‌లో చైర్‌పర్సన్ బోయ శాంత అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో రూ.61.44 కోట్ల బడ్జెట్ అంచనాలకు పాలకవర్గ సభ్యులు ఆమోదం తెలిపారు. ప్రారంభ నిల్వ రూ.18.73 కోట్లు కాగా, సాధారణ నిధుల రాబడి రూ.35.10 కోట్లు, మూలధనం రాబడి రూ.7.60 కోట్లు మొత్తం రూ.61.44 కోట్లు కాగా, ఇందులో సాధారణ మూలధన ఖర్చులు రూ.49.97 కోట్లుగా అధికారులు రూపొందించారు. సాధారణ ఖర్చులు రూ.28.80 కోట్లు, మూలధన ఖర్చులు రూ.24.17 కోట్లు పోగా, ముగింపు నిల్వ రూ.11.46 కోట్ల అంచనాలతో బడ్జెట్ రూపొందించారు. 2024–25కు ఈ ముగింపు నిల్వ ప్రారంభ నిల్వగా అంచనాలు వేశారు. బడ్జెట్‌లో శానిటేషన్, ఇంజినీరింగ్ విభాగం, ఎలక్ట్రికల్ తదితర విభాగాలకు నిధులు కేటాయించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్, మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ఈ యేడాది అంచనాలతో కూడిన బడ్జెట్ దాదాపు రూ.7 కోట్లు మేర తగ్గిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల కల్పనకు భారీగా నిధులు కేటాయించడం జరిగిందన్నారు. కౌన్సిలర్లు రఘునాథ్‌రెడ్డి, బాలాజీ మాట్లాడుతూ చెత్త సేకరణకు అవసరమైన ట్రక్కులు నిలిచిపోవడం వల్ల వార్డులో పారిశుద్ధ్యం లోపిస్తోందని, ఏరోజుకారోజు చెత్తను కంపోస్టు యార్డుకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణంలో పురాతన బావులు, కట్టడాలను ఆధునికీకరించాలని కోరారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వెంకన్నబావి, పెద్దమసీదులోని పురాతనబావి, చౌదరబావి రాతి కట్టడాలను అభివృద్ధి చేయాలన్నారు. అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, టీపీఓ శ్రీనివాసులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా క్రీడాపోటీలు




డి.బెళగల్‌లో పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ


ఆదోని సెంట్రల్: ఆడుదాం- ఆంధ్ర క్రీడాపోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. పట్టణంలో బుధవారం పురపాలక మైదానం, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, అక్షర శ్రీ పాఠశాల, ఆర్ఆర్ లేబర్ కాలనీ, జీవేశ్వర పాఠశాల, ఎన్‌జీఓ కాలనీ పార్క్, సెయింట్ జోసఫ్ పాఠశాల, అమరావతినగర్, అందర్ పేట ఉర్దు పాఠశాల వంటి 12 క్రీడా మైదానంలో ఆటల పోటీలు జరిగాయి. పురపాలక కమిషనర్ రఘునాథరెడ్డి పర్యవేక్షణలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. అయా క్రీడా మైదానాల వద్ద పండుగ వాతవరణం నెలకొంది. సత్తా చాటిన క్రీడాకారులను మండల స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు కో-ఆర్డినేటర్లు నరసయ్య, జి.రామన్న తెలిపారు.

కోసిగి: క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకోవాలని ఎంఈఓ నాగేశప్ప సూచించారు. బుధవారం రెండవ రోజు డి.బెళగల్ గ్రామంలో ఆడుదాం – ఆంధ్ర క్రీడాపోటీలను గ్రామ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఆ గ్రామంతో పాటు. దుద్ది, ఆర్లబండ, సాతనూరు, చిర్తనకల్లు గ్రామాల్లో క్రికెట్ పోటీలు నిర్వహించారు. యువకులు, పెద్దలు క్రీడాపోటీలను ఉత్సాహంగా తిలకిస్తుండగా మైదానాల వద్ద పండుగ వాతావరణం నెలకొంది. వైఎస్సార్‌సీపీ నాయకులు నరసన్న, మల్లికార్జున గౌడ , పంచాయతీ కార్యదర్శి పరుశురాముడు తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం: క్రీడల్లో సత్తా చాటడం ద్వారా ఉద్యోగ అవకాశాలను పొందవచ్చని బాపురం గ్రామ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గురునాథ్‌రెడ్డి అన్నారు. ఆడుదాం ఆంధ్ర పోటీల్లో భాగంగా రెండవ రోజు బాపురం గ్రామంలో పావురాలను ఎగరవేసి కబ్బడ్డీ పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లో నైపుణ్యం వెలికితీసే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడా పోటీలను ప్రారంభించారన్నారు. హెచ్ఎం సావిత్రి, ఫిజికల్ డైరెక్టర్ శేషు, ఎంపీటీసీ జయపాల్, నాయకులు అయ్యప్ప రెడ్డి, శ్రీనివాసరెడ్డి, సచివాలయ కన్వీనర్ నాగన్నగౌడ్ పలువురు పాల్గొన్నారు. అలాగే కౌతాళంలో వాలీబాల్ పోటీలను హెచ్ఎం ఇమ్మాన్యుయేల్ ప్రారంభించారు. వ్యాయామ ఉపాధ్యాయులు చామంతి, కల్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.



కబడ్డీలో తలపడుతున్న దృశ్యం



బాపురంలో పావురాలను ఎగురవేసి పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఆలూరు గిరిజన గురుకుల పాఠశాల క్రీడాకారిణులు

ఆలూరు: రాష్ట్రస్థాయిలో విజయనగరం జిల్లా కోనవలసలో గురువారం నుంచి జరగనున్న వివిధ క్రీడా పోటీలకు ఆలూరు గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు పీఈటీ ప్రతాప్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పాఠశాల నుంచి అండర్-14 ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, త్రోబాల్ విభాగాల్లో 14 మంది ఎంపికైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా క్రీడాకారిణులను ప్రిన్సిపాల్ షాహినూర్ అభినందించారు.

క్రీడాకారుడికి ఆర్థిక సాయం



వీరేష్‌కు సాయం అందిస్తున్న వాల్మీకి, ఉపాధ్యాయ సంఘం నేతలు

ఆదోని సెంట్రల్: వెయిట్ లిఫ్టింగ్‌లో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన బావిగట్టు వీరేష్‌కు వాల్మీకి ఉపాధ్యాయ ఉద్యోగ సంఘం నేతలు నరసయ్య, సత్యన్న, లక్ష్మీకాంత్, రమేష్‌నాయుడు బుధవారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. కౌతాళం మండలం తోవి గ్రామానికి చెందిన వీరేష్ ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. ఈ నెల 28 నుంచి జనవరి 8వ తేదీ వరకు అరుణాచల్‌ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబం నుంచి వచ్చిన వీరేష్ జాతీయ స్థాయి పోటీలకు వెళ్లేందుకు వాల్మీకి ఉపాధ్యాయ సంఘం సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. క్రీడాకారులకు అండగా ఉంటామని వారు వెల్లడించారు.